# విద్యాశాఖ ఆదేశాలను లెక్కచేయని కార్పొరేట్ పాఠశాలలు...తల్లిదండ్రుల ఆవేదన

**- మౌనం వహిస్తున్న విద్యాశాఖ అధికారి..**

శ్రీకాళహస్తి పట్టణంలోని కొన్ని ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ ఉత్తర్వులను కూడ పట్టించుకోకపోవడం తీవ్ర వివాదానికి దారితీస్తుంది. సమస్యలను పరిష్కరించాల్సిన విద్యాశాఖ అధికారి కూడ చర్యలు తీసుకోకుండా మౌనంగా ఉండడం, దీనితో ఇక ఎవరికి చెప్పుకోవాలో తెలియక దిక్కు తోచని స్థితిలో తల్లిదండ్రులు తీవ్ర ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. పూర్తి వివరాల్లోకి వెళ్లినట్లయితే... ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యాహక్కు చట్టం ఆర్టీఈ 2009 లోని 12(1)(సి) ప్రకారం ప్రతి ప్రైవేట్ మరియు అన్ ఎయిడెడ్ పాఠశాలలో 25% సీట్లు బడుగు, బలహీన వర్గాల పిల్లలకు ఉచితంగా ఇవ్వాలని స్పష్టంగా ఆదేశించింది. అందులో భాగంగా 2026-27 విద్యా సంవత్సరానికి నోటిఫికేషన్ ని కూడ విడుదల చేసింది. సాధారణంగా ఇలాంటి నోటిఫికేషన్ ద్వారా ఎంపికైన విద్యార్థులకు 1వ తరగతి నుండి 8వ తరగతి వరకు పూర్తి ఫీజు మినహాయింపు ఉంటుంది. ఈ ఫీజులను రాష్ట్ర ప్రభుత్వం "తల్లికి వందనం" పథకం ద్వారా తల్లి ఖాతా నుంచి ఆయా పాఠశాలలకు నేరుగా జమ చేసే విధంగా నోటిఫికేషన్ జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 2026-27 విద్యా సంవత్సరానికి ఈ నోటిఫికేషన్ ద్వారా మొదటి లాటరీ ఫలితాలలో సుమారు 30,075 మంది విద్యార్థులు అర్హత సాధించగా, తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి మండలంలో 22 మంది విద్యార్థులు ఎంపికైనట్లు మండల విద్యాశాఖ అధికారి భువనేశ్వరి అధికారికంగా వెల్లడించారు. ఎంపికైన విద్యార్థుల తల్లిదండ్రులు తప్పనిసరిగా ఏప్రిల్ 7వ తేదీ లోపు తమకు కేటాయించిన పాఠశాలల్లో తమ పిల్లలకు అడ్మిషన్ ప్రక్రియ పూర్తి చేయించాలని సూచించారు. అడ్మిషన్ సమయంలో విద్యార్థి ఆధార్ కార్డు, జనన ధృవీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రం, కుల ధృవీకరణ పత్రం, తల్లిదండ్రుల ఆధార్ కార్డులు మరియు తల్లి బ్యాంకు ఖాతా వివరాలు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. అదేవిధంగా ఫీజుల అంశంపై స్పష్టతనిస్తూ, "తల్లికి వందనం" పథకం ద్వారా తల్లి ఖాతాలో జమయ్యే రూ 13,000లో నుంచి పాఠశాలల స్టార్ రేటింగ్ ప్రకారం ఫీజులు ఆటోమేటిక్‌గా ఆయా పాఠశాలలకు బదిలీ అవుతాయని తెలిపారు. మరోవైపు ప్రభుత్వం విద్యాహక్కు చట్టం (ఆర్టీఈ) 2009 12(1)(జ) ప్రకారం నోటిఫికేషన్ లో ప్రైవేట్ పాఠశాలలలో ఏదైనా సమస్యలు ఎదురైతే ఫిర్యాదు చేయడానికి ఒక టోల్ ఫ్రీ నెంబర్ కూడ ఇవ్వడం జరిగిందని, కానీ ఆ నెంబర్ ఇప్పటివరకు పనిచేయకపోవడం, పర్యవేక్షణ లోపంగా ఉన్నదని, ఇది అధికారుల బాధ్యతారాహిత్యానికి ఇదొక ఉదాహరణగా చెప్పుకోవచ్చని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు.

స్టార్ రేటింగ్ ప్రకారం ఫీజుల వివరాలు ఇలా ఉన్నాయి


**స్టార్ రేటింగ్ - 1 పాఠశాలకు - 8,500**

**స్టార్ రేటింగ్ - 2 పాఠశాలకు - 10,000**

**స్టార్ రేటింగ్ - 3 పాఠశాలకు - 11,500**

**స్టార్ రేటింగ్ - 4 పాఠశాలకు -13,000**

ఈ విధంగా ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులను మాత్రమే పాఠశాలలకు చెల్లించబడుతుందని, అదనంగా తల్లిదండ్రులు నుండి ఎటువంటి ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేదని ప్రభుత్వ ఆదేశాలు వున్నాయన్నారు. కానీ ఈ విషయంపై స్థానిక విద్యా శాఖ అధికారులు, తల్లిదండ్రులకి అవగాహన కలిగించడంలో పూర్తిగా విఫలం అవడం చేత, దీనిని అదనుగా భావించిన కార్పొరేట్ పాఠశాలలు, ఆ తల్లికి వందనం పథకం ద్వారా పడే డబ్బులు మొత్తం కూడా స్టార్ రేటింగ్ తక్కువ ఉన్న పాఠశాలలు కూడా మొత్తం డబ్బులు కట్టించుకుంటున్నాయి. చాలా పాఠశాలలు అడ్మిషన్ ఫీజు, రెన్యువల్ ఫీజుల పేరుతో వసూలు చేయడం కూడ జరుగుతూ ఉన్నది. అలాగే ఏప్రిల్ 12 వ తేదీన 3 నుండి 5 కిలోమీటర్ల పరిధిలోని పాఠశాలలలో ఎంపిక జాబితాను కూడ విడుదల




చేయనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. విద్యాశాఖ అధికారి మౌనం వెనుక ఆంతర్యం ఏమిటి? విద్యాహక్కు చట్టం - 2009 ద్వారా ఎంపికైన విద్యార్థుల నుంచే కొన్ని కార్పొరేట్ పాఠశాలలు అడ్మిషన్ ఫీజులు వసూలు చేస్తున్నాయని తల్లి తండ్రులు మండల విద్యాశాఖ అధికారికి పలుమార్లు మొరపెట్టుకుంటున్నా, ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోకపోవడం పై అనుమానాలకు తావిస్తున్నట్లు ఉందని అభిప్రాయపడుతున్నారు. పాఠశాల యాజమాన్యాలతో సమావేశాలు నిర్వహించి, ప్రభుత్వ నిబంధనలు తెలియజేశామని అధికారి చెప్పినప్పటికీ, ఎవరు చెప్పినా అడ్మిషన్ ఫీజులు కట్టాల్సిందే అని కట్టించుకోవడం హేయమైన చర్యగా తల్లిదండ్రుల భావిస్తున్నారు. ఆ విషయాన్ని మళ్లీ అధికారికి తెలియపరచినా దానికి పరిష్కారం చూపకుండా మాట దాటవేయడం వెనుక ఆంతర్యం ఏమిటని...తల్లిదండ్రుల్లో అసంతృప్తి పెరుగుతోంది. "ప్రభుత్వ ఆదేశాలు ఒకవైపు, పాఠశాలల వసూళ్లు మరోవైపు మధ్యలో మేమే నష్టపోతున్నాం" అని పలువురు తల్లిదండ్రులు వాపోతున్నారు. ఆ విద్యాశాఖ అధికారి కి "అధికారానికి మించిన ఒత్తిళ్లు ఉన్నాయా? లేక నిర్లక్ష్యమే కారణమా?" అనే ప్రశ్నలు తల్లిదండ్రుల్లో వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో సంబంధిత అధికార యంత్రాంగం వెంటనే తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘిస్తున్న పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆర్.టి.ఇ కింద ఎంపికైన విద్యార్థులకు పూర్తి న్యాయం చేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

# జనసేన కార్యకర్త కుటుంబానికి రూ.5 లక్షల బీమా చెక్కు అందజేత

**- జనసేన యువ నాయకుడు పసుపులేటి నవీన్ కుమార్**



శ్రీకాళహస్తి నియోజకవర్గం గోపాల వనం స్ట్రీట్ (నాయుడు బిల్డింగ్స్)కు చెందిన జనసేన కార్యకర్త బుర్ర ప్రియాంక రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, వారి కుటుంబానికి జనసేన పార్టీ తరఫున రూ.5 లక్షల ప్రమాద బీమా చెక్కును పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్ అందజేశారు. ఈ చెక్కును మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో ప్రియాంక భర్త బుర్ర చైతన్యకాంత్‌కు అందించారు.ఈ సందర్భంగా జనసేన యువ నాయకుడు పసుపులేటి నవీన్ కుమార్ మాట్లాడుతూ, జనసేన క్రియాశీలక సభ్యత్వం ద్వారా బాధిత కుటుంబాలకు ఆర్థిక భరోసా లభించడం సంతోషకరమని తెలిపారు.తాళ్లూరి రామ్ మాట్లాడుతూ, ప్రతి జనసైనికుడి భద్రత కోసం జనసేన అధినేత పవన్ కల్యాణ్ దూరదృష్టితో ఈ బీమా పథకం అమలు అవుతోందని పేర్కొన్నారు. క్రియాశీలక సభ్యత్వం కలిగిన ప్రతి జనసైనికుడికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.ప్రియాంక భర్త బుర్ర చైతన్యకాంత్ మరియు కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రమాద వివరాలు తెలుసుకుని, ఆమె మృతిపై సంతాపం వ్యక్తం చేశారు. ఈ బీమా ప్రక్రియలో సహకరించిన పసుపులేటి నవీన్ కుమార్‌కు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దండి నరేంద్ర పాల్గొన్నారు.జనసేన పార్టీ సభ్యత్వ నమోదు యొక్క ప్రాముఖ్యత మరియు ఆవశ్యకతపై జనసేన యువ నాయకుడు పసుపులేటి నవీన్ కుమార్ ప్రజలకు అవగాహన కల్పించారు. క్రియాశీలక సభ్యత్వం ద్వారా కార్యకర్తలకు బీమా వంటి ఆర్థిక భద్రత లభిస్తుందని ఆయన తెలిపారు.జనసేన పార్టీ సభ్యత్వం కలిగిన ప్రతి జనసైనికుడికి అవసరమైన సమయంలో పార్టీ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఇటీవలి ఘటనల ద్వారా సభ్యత్వం విలువ స్పష్టమవుతోందని, మరింత మంది యువత సభ్యత్వం పొందాలని ఆయన పిలుపునిచ్చారు.

# టీటీడి చైర్మన్ ను పదవినుంచి తొలగించాలి

**- వైసీపీ మాజీ ఎమ్మెల్యే బాలరాజు డిమాండ్**





కలియుగ వైకుంఠం, పరమ పవిత్రమైన తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతిష్టను మంటగలుపుతున్న టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడును వెంటనే ఆ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కదం తొక్కాయి. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్త నిరసనల్లో భాగంగా, పోలవరం మాజీ శాసనసభ్యులు తెల్లం బాలరాజు ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం నరసన్నపాలెం కరాటం వై జంక్షన్ వద్ద భారీ ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు మాట్లాడుతూ కోట్లాది మంది భక్తుల ఆరాధ్య దైవం వేంకటేశ్వర స్వామి కొలువైన తిరుమల పవిత్రతను బి.ఆర్. నాయుడు తన వివాదాస్పద వైఖరితో అప్రతిష్ట పాలు చేస్తున్నారని మండిపడ్డారు. పవిత్రమైన ఆలయ చైర్మన్ పదవికి ఆయన అనర్హుడని, తక్షణమే ప్రభుత్వం ఆయన్ను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర నాయకులు జెట్టి గురునాధరావు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీపీలు, జడ్పీటీసీలు ఎంపీటీసీలు, సర్పంచులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు టౌన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ వాహనాలకు ఎమ్మెల్యేల సహకారం



ఏలూరు జిల్లా ఇన్చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, ఏలూరు రేంజ్ ఐజీ జి వి జి అశోక్ కుమార్, ఏలూరు జిల్లా కలెక్టర్ కె. వెట్రీ సెల్వి, ఏలూరు జిల్లా ఎస్పీ కె ప్రతాప్ శివ కిషోర్ శనివారం ఆంధ్రా ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆకాంక్షకు అనుగుణంగా పి 4 పద్ధతిలో ఉంగుటూరు ఎమ్మెల్యే పచ్చమట్ల ధర్మరాజు సహకారం, చింతలపూడి ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్ సహకారంతో 6 జీప్ లు ఒక్కొక్కటి రూ.10 లక్షలు ఖరీదు చేసేటటువంటి వాహనాలు 60 లక్షల వ్యయంతో నిడమర్రు సర్కిల్ ఆఫీసుకు గణపవరం , నిడమర్రు, చేబ్రోలు,భీమడోలు,చింతలపూడి పోలీస్ స్టేషన్ కు మొత్తం ఆరు వాహనాలను ప్రజల యొక్క సహకారంతో సంబంధిత ఎమ్మెల్యేలు యొక్క సహకారం తో అందజేశారు.ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథులుగా నాదెండ్ల మనోహర్ , కొలుసు పార్థసారధి సమక్షంలో అధికారు లకు అంద చేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న గృహ నిర్మాణ శాఖ మాత్యులు, కొలుసు పార్థసారధి మాట్లాడుతూ ఏలూరు రేంజి ఏలూరు జిల్లాలో ఉన్న అధికారులు ఎంతో నిబద్ధతతో ఉద్యోగ నిర్వహణ చేస్తున్నారని,అందుకు ఒకటే ఉదాహరణ అని నూజివీడులో ఈ మధ్యకాలంలో జరిగిన ఒక దొంగ తనాన్ని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి జిల్లా ఎస్పీ సారధ్యంలో పోలీసులు దొంగను గుర్తించడం జరిగిందని ఆ దొంగ ఇంటికి చేరకుండానే అతని ఇంటి వద్ద పోలీసు అతన్ని అదుపు లోనికి తీసుకున్న సమయంలో అయ్యా నేను ఇంటికి చేరకుండా గానే పోలీస్ వారు నా ఇంటి వద్దకు రాగలిగారు అంటే ఈ ప్రాంతాలలో ఇక దొంగ తనం చేయడానికి ఎవరూ సాహసం చేయరని తెలిపారు.మరొక దొంగతనం నూజివీడు ప్రాంతంలో జరిగిన విషయంలో ఆ దొంగ యొక్క ఆచూకీని తెలుసుకొనుట కొరకు మళ్లీ జిల్లా ఎస్పీ సారధ్యంలో లక్నోలో ముద్దాయి యొక్క ఆనవాళ్లను కనుగొనడం జరిగిందని , ఇంత నిబద్ధత ఉద్యోగ నిర్వహణ చేస్తున్న టువంటి పోలీసులకు క్షేత్రస్థాయిలో ఉద్యోగ నిర్వహణకు కావల సినటు వంటి సౌక ర్యాలను కలగ చేయాలని తెలిపారు.ఉంగుటూరు, చింతలపూడి ఎమ్మెల్యేలు చేసినటువంటి సహాయ సహకారాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా ఇన్చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో శాంతి భద్రతల నిర్వహణ కొరకు ముఖ్యమంత్రి ప్రత్యేక మైనటు వంటి శ్రద్ధను కనబరుస్తున్నారని అలాగే గంజాయి నిర్మూలన కొరకు శాంతి భద్రతలు పరిరక్షణ కొరకు పోలీసు వ్యవస్థ సిబ్బంది నేర స్థలాలకు త్వరితగతిన చేరుట కొరకు ప్రతి సంవత్సరము 100 కోట్ల రూపా యలను వాహనాలు కొనుగోలు చేయుట కొరకు విధివిధానాలను రూపకల్పన చేసినట్లు, ఆరు వాహనాలు 60 లక్షల వ్యయంతో పోలీసు వ్యవస్థ కు అంకితం చేయడం దాంట్లో నేను పాల్గొని చాలా ఆనందంగా ఉందని తెలియ చేశారు. ఏలూరు రేంజ్ ఐజి జి వి జి అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రజాభద్రత కొరకు దాతలు తమ సహకారం అందించిన నేపథ్యంలో జిల్లాలో దాతల సహకారంతో ఇప్పటివరకు 19 వాహనాలను ఏలూరు జిల్లా పోలీసులకు అందజేయడం ఎంతో అభినందనీయమని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కూడా కొత్త వాహనాలను అందించే దిశగా చర్యలను తీసుకుంటుందని, శాంతిభద్రతల పరిరక్షణ కొరకు పోలీసులు నేరస్థలాలకు త్వరితగతిన చేరటానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఐజి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కె ప్రతాప్ శివ కిషోర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు ఏలూరు జిల్లా కు ౖా.4 పద్ధతులను అను సరించి ఏలూరు జిల్లా వ్యాప్తంగా 19 వాహనాలను పోలీస్ డిపార్ట్మెంట్ నకు అందజేసిన విషయంపై ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలను అందించారని, ఇప్పుడు ఉంగుటూరు ఎమ్మెల్యే పచ్చమట్ల ధర్మరాజు, చింతలపూడి ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్ ల సహకారం ఎంతో అభినందనీయమని, ప్రత్యేకమైనటువంటి కృతజ్ఞత లను తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డి గూడెం ఏఎస్పీ శ్రీమతి సుస్మిత , ట్రైనీ ఐపీఎస్ జయ, ఏ ఆర్ అదనపు ఎస్పీ జీ ముని రాజా , ఏలూరు డీఎస్పీ డి శ్రావణ్ కుమార్, మహిళ పోలీస్ స్టేషన్ డీఎస్పీ యు రవి చంద్ర, ఎస్ ఈబి ఎస్సై మల్లేశ్వర రావు , చింతలపూడి ఎస్సూ క్రాంతి కుమార్, నిడమర్రు ఎస్సై రజనీ కుమార్, ఏ ఆర్ డీఎస్పీ చంద్ర శేఖర్, ఏలూరు 1టౌన్ ఇన్స్పెక్టర్ సత్యనారా యణ, ఏలూరు 2 టౌన్ ఎస్సై అశోక్ కుమార్ , ఏలూరు 3 టౌన్ ఇన్స్పెక్టర్ కోటేశ్వర రావు, మహిళ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎం.సుబ్బా రావు, ఏ ఆర్ ఆర్ ఐ పవన్ కుమార్ , ఎస్ఐ రాంబాబు, గణపవరం ఎస్ఐ మణి కుమార్ నిడమర్రు ఎస్ఐ ప్రసాద్ చేబ్రోలు సూర్య భగవాన్ భీమడోలు ఎస్సై మదీనా భాష మరియు చింతలపూడి ఎస్ఐ సతీష్ కుమార్ ,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# తడికలపూడికి మహిళా ఎస్సై



తడికలపూడి ఎస్సైగా వల్లి పద్మ ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఆమె ఏలూరు సైబర్ సెల్ విభాగంలో ఎస్సైగా విధులు నిర్వహించారు. సాధారణ బదిలీలలో భాగంగా ఆమె తడికలపూడి ఎస్సైగా శనివారం బాధ్యతలు స్వీకరించారు.

# కేఏ పాల్ స్థానాన్ని జగన్ భర్తీ చేశారు- ఎమ్మెల్యే కోటంరెడ్డి



జగన్ ప్రస్తుతం 'మావిగన్.. మావిగన్' అంటూ గావుకేకలు వేస్తున్నారని.. సీఎంగా ఉన్నప్పుడు మావిగన్ గుర్తుకు రాలేదా అని ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి ప్రశ్నించారు.ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఒక్క వైసీపీ తప్పించి.. అన్ని రాజకీయ పార్టీల ఆమోదంతో అమరావతి బిల్లు పార్లమెంట్లో ఆమోదం పొందిందన్నారు. రాష్ట్రంలో మనుగడ లేదన్న నిరాశ, నిస్పృహలోకి జగన్ వెళ్లారని ఎద్దేవా చేశారు.విచక్షణతో మాట్లాడండి జగన్. మావిగన్.. మావిగన్ అంటూ మాట్లాడితే కేఏ పాల్ కు మీకు తేడా ఉండదన్నారు.రాజకీయాల్లో కేఏ పాల్ స్థానాన్ని జగన్ భర్తీ చేశారని కోటంరెడ్డి వ్యాఖ్యానించారు.

# జిల్లా ఇంఛార్జి మంత్రికి అపూర్వ స్వాగతం

**- జిల్లా ఇంఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ కి అపూర్వ స్వాగతం పలికిన జిల్లా కలెక్టరు, ఐజీ, ఎస్పీ , ఎమ్మెల్యే.**



ఏలూరు పోలీసు ప్రెరేడ్ గ్రౌండ్ లో శనివారం జిల్లా పర్యటనకు వచ్చిన జిల్లా ఇంచార్చ్ మంత్రి, రాష్ట్ర పౌరసరఫరాలు శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ జిల్లా ఉన్నతాధికారులు అపూర్వ స్వాగతం పలికారు.మర్యాద పూర్వకంగా కలసిన జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి, ఏలూరు రేంజి ఐజి జి.వి.జి.అశోక్ కుమార్, జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్, ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, పత్సమట్ల ధర్మరాజు పూలమొక్కలను అందజేశారు.